

నేడు పీజీఆర్ఎస్ రద్దు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్లు చెప్పారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.



కొత్తూరు మండలం వసప వద్ద పంట భూముల్లో సంచరిస్తున్న ఏనుగులు (ఫైల్)



టిడ్కో గృహ సముదాయం వద్ద పట్టుబడిన భారీ కొండచిలువ (ఫైల్)

అడవిని వీడి.. జనావాసాల్లోకి

- మైదాన ప్రాంతాల్లో సంచరిస్తున్న వన్యప్రాణులు
- నీటి కోసం వచ్చి ప్రాణాలు కోల్పోతున్న వైనం
- అటవీ సంపద తరిగి పోతుండడమే కారణం



- వారం రోజుల కిందట కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఆవరణలోకి ఓ అడవి గొర్రె వచ్చింది. కుక్కలు దాడి చేయడంతో అది తీవ్రంగా గాయపడింది. ఒక రోజు చికిత్స అనంతరం మృతి చెందింది.
- రెండునెలల కిందట పలాస మండలం వీరభద్రాపురం గ్రామ సమీపంలో ఐదు రక్తపింజరి పాములు కనిపించడంతో ప్రజలు భయాందోళనకు గురైయ్యారు. స్నేక్ క్యాచర్ వచ్చి చాకచక్యంగా వాటిని పట్టుకొని సమీప కొండల్లో విడిచిపెటాడు.
- రెండు రోజుల కిందట మందస మండలంలో అరుదైన చుక్కల జింకలు కనిపించాయి. నీటి కోసం కొండపై నుంచి కిందకు దిగి గ్రామాల్లో సంచరించాయి. కుక్కలు వెంబడించడంతో అవి రక్షణ కోసం ఇళ్లలోకి చొరబడ్డాయి.

పలాస, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కాశీబుగ్గ, పాతపట్నం అటవీ పరిధిలోని వివిధ వన్యప్రాణులు జనావాసాల్లోకి వచ్చేస్తోన్నాయి. గ్రామాలు, రోడ్లపై సంచరిస్తూ కనిపిస్తోన్నాయి. భామిని, కొత్తూరు ప్రాంతాల్లో ఏకంగా ఏనుగుల గుంపే తిరుగుతుంది. పాములు, ఎలుగుబంట్లు, హైనాల గూర్చి చెప్పనవసరం లేదు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో అడవి జంతువులు సంచరిస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. పోడు వ్యవసాయం పేరుతో అడవుల్లో చెట్లను నరికివేయడం, కలప కోసం భారీ వృక్షాలను తరలించడం, కొండలు, గుట్టలపై అక్రమంగా కంకర తవ్వకాలు చేపట్టడం తదితర కారణాలతో అడవిలో ఉండాల్సిన జంతువులు జనావాసాల్లోకి వస్తున్నాయని వన్యప్రాణి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు వర్షాభావం కారణంగా నీటి నిల్వలు తగ్గిపోవడంతో జలం కోసం వెతుకుతూ గ్రామాల్లోకి వచ్చి కుక్కలు, మనుషుల దాడుల్లో మృత్యువాత పడుతున్నాయి. స్వేచ్ఛాజీవులైన జింకలు, అడవి గొర్రెలను మనుషులు తాకితే చాలు వాటి ప్రాణాలు సగం పోయినట్లేనని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. అడవుల్లో తగిన నీటి కుంటలు ఏర్పాటు చేయడం, ఆ ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటలను అభివృద్ధి చేస్తే నీటి కోసం వన్యప్రాణులు మైదాన ప్రాంతాల్లోకి రాకుండా ఉంటాయి. అడవి జంతువుల రక్షణ కోసం గ్రామాల్లో అటవీశాఖ అధికారులు విస్తృత ప్రచారాలు చేస్తున్నారు. గిరిజన గ్రామాల్లో జంతువులపై అవగాహన కల్పిస్తున్నారు.



వీరభద్రాపురం వద్ద రక్తపింజర్లు (ఫైల్)



పలాస పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో చికిత్స పొందుతూ మృతి చెందిన అడవిగొర్రె (ఫైల్)

అవగాహన కల్పిస్తున్నాం..

ప్రజలకు అడవి జంతువుల రక్షణపై అవగాహన కల్పిస్తున్నాం. జింకలు గ్రామాల్లోకి వచ్చి వీధి కుక్కల బారిన పడి మృతి చెందుతున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వాటి రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నాం. జంతువుల వేట సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అడవుల్లో చెట్లు నరకడం, కంకర తవ్వకాలను అడ్డుకోవడంపై దృష్టి సారించాం.

-మురళీకృష్ణ, అటవీశాఖ అధికారి, కాశీబుగ్గ

నిబంధనలు పట్టట్లే!



ఇచ్ఛాపురంలోని ఓ మద్యం దుకాణం వద్ద ఇలా..

- మద్యం దుకాణాల చుట్టూ అనధికార షాపులు
- అక్కడే బహిరంగంగా తాగుతున్న వైనం
- విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు
- అధిక ధరలకు విక్రయాలు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాలా మద్యం దుకాణాల వద్ద కనీస నిబంధనలు పాటించడం లేదు. మద్యం దుకాణాల చుట్టూ అనధికారికంగా షాపులు వెలుస్తున్నాయి. అక్కడే మద్యం తాగుతుండడంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. జిల్లాలో 158 మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే చాలా వరకూ షాపుల వద్ద కనీస నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేసిన వారు చుట్టుపక్కల ఉన్న ఇతర షాపులను సైతం అద్దెకు తీసుకుంటున్నారు. అక్కడ తమ వారితోనే ఫాస్టుఫుడ్ సెంటర్లు, పాన్ షాపులు పెడుతున్నారు. వాస్తవానికి మద్యం దుకాణాల వద్ద ప్రభుత్వం ఎటువంటి పర్మిట్ రూమ్‌లకు అనుమతివ్వలేదు. అక్కడే తాగేందుకు అవకాశమిస్తే ప్రభుత్వానికి అదనంగా రూ.5 లక్షలు కట్టాల్సి ఉంది. నోటిఫికేషన్‌లోనే ఇది స్పష్టంగా చెప్పారు. ఒక వేళ షాపులో మద్యం నిల్వలు చాల కుంటే.. అదనంగా గోదాములు అద్దెకు తీసుకున్నవారు ఏడాదికి ప్రభుత్వానికి రూ.లక్ష వరకూ చెల్లించాల్సి ఉంటుంది. కానీ, జిల్లాలో చాలావరకూ షాపులు పర్మిట్ రూమ్‌లకు అనుమతి తీసుకోలేదు. అదనంగా ప్రభుత్వానికి రూపాయి చెల్లించలేదు. కానీ, ఎక్కడికక్కడే మద్యం దుకాణాల చుట్టూ వివిధ షాపులు వెలుస్తున్నాయి. అయితే వాటిని మద్యం వ్యాపారులే అద్దెకు ఇవ్వడమో, అనధికారికంగా నిర్వహించడమో జరుగుతోంది. అదే మాదిరిగా గోదాములు సైతం అనధికారికంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.



మరో మద్యం షాపు వద్ద ఇలా...

అంతా సిండికేట్!

ఈసారి మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు వ్యాపారులే కాదు అన్నివర్గాల ప్రజలు పోటీపడ్డారు. దీంతో రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. అయితే డ్రా తీయకుండా ముందే చాలా మంది సిండికేట్‌గా మారారు. షాపులు ఎవరికి దక్కినా.. అందరికీ వాటాలు అన్నవిధంగా ఒప్పందాలు చేసుకున్నారు. లాటరీ తీసిన (మిగతా 8వ పేజీలో..)

జీడిపై తెగుళ్ల దాడి

- మాడిపోతున్న పూత
- పిందె దశలోనే రాలిపోతున్న పిక్కలు
- లబోదిబోమంటున్న రైతులు



అరకొరగా ఉన్న పిక్కలు



మాడిపోయిన జీడిపూత

మామిడిపల్లిలో జీడి చెట్లకు పిక్కలు లేని దృశ్యం

పలాస రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి)

ఉద్దానంలో ప్రధాన వాణిజ్య పంటగా పేరొందిన జీడి తెగుళ్ల బారిన పడింది. టీ దోమ, తెల్ల దోమ, మట్టి తెగులు, బూడిద తెగులు, తేనెబంక పురుగు ఆశించి పూత దశలోనే పంటను నాశనం చేస్తున్నాయి. ఈ పాటికే పూర్తి స్థాయిలో పంట రావాల్సి ఉన్నా తెగుళ్ల దాడితో జీడిపూత నల్లగా మారి దిగుబడి తగ్గుముఖం పడుతుంది. ఈ ఏడాది మార్చి నుంచే విపరీతంగా ఎండ వేడి పెరగడం, సరైన వర్షాలు లేక పోవడంతో పంటలో వృద్ధి లోపించింది. దీంతో తెగుళ్ల దాడి పెరిగింది. ముఖ్యంగా జీడిపూత నల్లగా మారి రాలుతుండడం, పిక్కల్లో ఎదుగుదల సరిగా లేక పోవడం కనిపిస్తుంది. తామర పురుగు, టీ-పురుగు ధాటికి పిందె దశలోనే పిక్కలు రాలుతున్నాయి. రైతులు పురుగు మందులు పిచికారీ చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. ఈ ఏడాది ఎవరైతే సరైన ప్రణాళికతో సస్యరక్షణ చేపట్టారో వారి పంటలు మాత్రమే కొంత మేర మెరుగ్గా ఉన్నాయి. మిగతా వారి పంటలు అంత బాగా లేవు. ఏడాదికేడాది జీడి సాగు పెట్టుబడులు పెరుగుతున్నాయి. మందులు, తోట కంచెలు, ఆకులను ఒక చోటకు చేర్చడం, దుక్కి దున్నడం వంటి వాటి కోసం రైతులు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. అయితే, దిగుబడులు మాత్రం ఆస్థాయిలో ఉండకపోవడంతో నష్టపోతున్నారు. ఈ పాటికి (మిగతా 8వ పేజీలో..)

రోడ్లు బాగుపడనున్నాయ్

- మరమ్మతులకు రూ.20.75 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- నిధుల విడుదలకు చొరవ చూపిన మంత్రి అచ్చెన్న



శ్రీకాకుళం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలురోడ్లు బాగుపడను న్నాయి. వాటి మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు లు జారీ చేసింది. జిల్లాలో నియోజకవర్గాల వారీగా మరమ్మతులు చేపట్టాల్సిన రోడ్లు, వాటికి కావాల్సిన నిధులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రభుత్వానికి ఇటీవల నివేదిక అందించారు. దీంతో జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లోని 7 ప్రధాన రోడ్ల అభివృద్ధికి రూ.20.75 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. శ్రీకాకుళం నియోజకవర్గంలోని కళింగపట్నం-పార్వతీపురం రోడ్డుకు (8.60 కి.మీ) రూ.4కోట్లు, ఎచ్చెర్ల నియోజకవర్గంలోని హైవే నుంచి పైడయ్యవలస వయా అదపాక వరకు (1.100 కి.మీ) రోడ్డుకు రూ.2.2 కోట్లు, కోష్ట హైవే జంక్షన్ నుంచి కొయ్యాం వరకు (1.80 కి.మీ) రూ.కోటి, ఆమదాలవలస నియోజకవర్గంలోని చిలకపాలెం నుంచి రామభద్రపురం-రాయఘడ రోడ్డు(6.40 కి.మీ)కు రూ.2.75 కోట్లు, పాతపట్నంలో నౌతల-ముఖలింగం రోడ్డు (11.03 కి.మీ)కు రూ. 4.5 కోట్లు, టెక్కలిలో కోటబొమ్మాళి నుంచి సంతబొమ్మాళి వరకు (3.30 కి.మీ) రూ. 3.8 కోట్లు, నరసన్నపేట నియోజకవర్గంలోని ఉకలాం నుంచి కొమ్మనాపల్లి వరకు (5.40 కి.మీ) రహదారికి రూ.2.5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర రోడ్డు రవాణా భవనాల శాఖ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. మంత్రి అచ్చెన్న చొరవతో నిధుల విడుదల కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తులసమ్మా.. దీవించమ్మా

- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ



పూజలందుకున్న ధనరాజ తులసమ్మ

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లొద్దపుట్టి గ్రామదేవత ధనరాజ తులసమ్మ తల్లి దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి రాత్రి వరకు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తులసమ్మా.. దీవించమ్మా అంటూ వేడుకున్నారు. అనంతరం అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయం వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మీసాల చిన్నమ నాయుడు, పట్టణ, రూరల్ ఎస్ఐలు ముకుందరావు, శ్రీనువాసరావు తమ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

శ్రీకూర్మ క్షేత్రంలో..

గార, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథ స్వామి వారిని ఆదివారం ఉదయం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. చైత్రమాసం కావడంతో భక్తులు భారీ గా తరలివచ్చి క్యూలో నిల్చొని స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే, వత్సవలస రాజమ్మ జాత రకు వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో శ్రీకూర్మనాథుని దర్శించుకోవడంతో ఆలయం కిటకిటలాడింది. దేవదాయ శా ఖ రిటైర్డ్ కమిషనర్ సుందరకుమార్ తన కుటుంబ సభ్యుల తో కలిసి స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.



శ్రీకూర్మనాథుని దర్శనం కోసం క్యూలో భక్తులు

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం
- జిల్లావ్యాప్తంగా క్రైస్తవుల నగర సంకీర్తన
7 లో

చేపలవేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి
- గనగళ్లవానిపేట వద్ద ఘటన
8 లో

అమ్మో ట్రాఫిక్ జామ్
- భారీ వాహనాలతో తరచూ ఇబ్బందులే..
- ఆక్రమణల్లో వీకే పేట రహదారి
7 లో

అమ్మో ట్రాఫిక్ జామ్

- భారీ వాహనాలతో తరచూ ఇబ్బందులే..
- ఆక్రమణల్లో వీకే పేట రహదారి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధి వీకే పేట రోడ్‌లో తరచూ ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఒకేసారి భారీ వాహనాలు రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ప్రధానంగా ఈ రహదారి ఆక్రమణలకు గురికావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రహదారి ఆక్రమణల కు గురవడంతోనే ఈ తలెత్తుందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ కుళాయిలు కూడా రోడ్డుపైనే ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. అదివానం ఉదయం ఒకేసారి రెండు వాహనాలు రావడంతో పక్కనే ఉన్న కుళాయి గోతులో వాహనం ఇరుక్కునేది. అయిత్యే డ్రైవర్ చకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావాలంటే ఆక్రమణలను తొలగించడంతో పాటు భారీ వాహనాలు ఈ రహదారి పై నుంచి రానివ్వకుండా మునిసిపల్, పోలీస్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





వీకే పేట రోడ్డులో ఇరుక్కున్న వాహనాలు



సాంస్కృతిక ప్రదర్శనలు తిలకిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్, ఎమ్మెల్యే ఎన్ఈఆర్, ఎంపీలు కలిశెట్టి, శ్రీభరత్



ఆకట్టుకుంటున్న చిన్నారుల ప్రదర్శన

గ్రామీణ ప్రాంతాలకు గ్లోబల్ విద్య

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

రణస్థలం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో గ్లోబల్ విద్య అందించడం గొప్ప విషయమని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. 2025-26 విద్యా సంవత్సరం శుభారంబ్ సందర్భం గా ఆదివారం ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రితోపాటు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈవో తిరుమల చైతన్య, ఎంఈవో త్రినాధరావు, స్కూల్ డైరెక్టర్ తేజాబాబు, ప్రిన్సిపాల్ ఊర్మిల, వైస్‌ప్రిన్సిపాల్ రాంబాబు, బంటుపల్లి సర్పంచ్ నడకుదిటి రజిని తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

గార, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం కె.మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం)లో పార్టీ మండల అధ్యక్షురాలు మైలపిల్లి లక్ష్మీ జనార్దన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశానికి సుస్థిరమైన పాలన బీజేపీతోనే సాధ్యం అన్నారు. ఈ కార్యాలయాన్ని ప్రారంభించి దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పైడి వేణుగోపాలం, అట్టాడ రవిబాబ్జీ, బి.ఉమామహేశ్వరరావు, శవ్వాన ఉమామహేశ్వరి, చల్లా వెంకటేశ్వరరావు, మైలపిల్లి జనార్దన్, రుప్ప బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ పునఃప్రారంభం



సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

కంచిలి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జె.శాసనాం గ్రామ దేవత నింబాషిణి అమ్మ వారి ఆలయ పునఃప్రారంభోత్స కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, సహస్రనామార్చన, ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కంచిలి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు. దొంగతనాలు చేసే ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠా మండలం పరిధిలో తిరుగుతున్నారని ప్రజలు ఇంటి బయట, మేడలపై రాత్రి నిద్రించవద్దని కోరుతూ గ్రామాల్లో ఆదివారం ఆటోపై ప్రచారం నిర్వహించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. అపరిచితులు, అనుమానితులు తారాస పడితే కంచిలి పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

సందడిగా నేతాలమ్మ యాత్ర



జి.సిగడాం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వాంద్రంగిలో నేతాలమ్మ యాత్ర మహోత్సవాలు ఆదివారం సందడిగా ప్రారంభమైంది. అమ్మవారికి పసుపు, కుంకుమ, ముర్రాటలతో మొక్కులు చెల్లించుకున్నారు. నేతాలమ్మ ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. తిరువీధి అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ముర్రాటలతో శుద్ధి చేశారు.

రక్తదాన శిబిరం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 25మంది రక్తదానం చేసినట్టు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎం.రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ పి.దినేష్, ప్రాజెక్ట్ చైర్మన్ డాక్టర్ దేవదాస్, బ్లడ్ సెంటర్ మేనేజర్ ఎస్.పృథ్వీ, రొటేరియన్స్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు దారుణం

అరసవల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా తిరుమల తిరుపతి దేవస్థానంపై భూమన కరుణాకర రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారం దారుణమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో గల తన కార్యాలయంలో ఆయన ఆదివారం మాట్లాడుతూ.. కరుణాకరరెడ్డి మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. గోశాలలోని ఆవులు వృద్ధాప్యం, డెలివరీ సమయంలో, వ్యాధులకు గురై నెలకు సగటున 10 వరకు మృత్యువాత పడుతుంటాయన్నారు. టీటీడీ గోశాలలో 260 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, 1668 ఆవులకు జియోట్యాగింగ్ చేసి ప్రతీరోజు పర్యవేక్షిస్తుంటారన్నారు. టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అసత్య ఆరోపణలు చేస్తున్న కరుణాకరరెడ్డిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

ఘనంగా తెరవే కవి సమ్మేళనం



శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తెలుగు రచయితల వేదిక (తెరవే) కవులచే 103వ నెలవారీ సాహిత సమ్మేళనం ఆదివారం స్థానిక ఓ ప్రైవేట్ కళాశాలలో సంస్థ అధ్యక్షుడు ఉత్తరావల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా బగాది వెంకటరావు పాల్గొని మాట్లాడుతూ.. యువతను సాహిత్య పథంలోకి తీసుకొని రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో 16 మంది కవులు పాల్గొన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా కవితలు, పద్య పఠనం, ఇతర అంశాలపై కవితలు చదివి వినిపించారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం



రిటైర్డ్ ఐఏఎస్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో భద్రాజీ

అరసవల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని విశాఖ జిల్లాకు చెందిన చాగంటి సన్యాసి రాజు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి రూ.1లక్షను ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఎ.శోభనాద్రాచార్యులకు అందజేశారు. అర్చకులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ● స్వామివారిని అధిక సంఖ్యలో ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. ఈ ఒక్కరోజు స్వామివారికి రూ.5,22,682ల ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్లు రూపంలో రూ.2,67,800, పూజలు, విరాళాల ద్వారా రూ.78,417, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,76,465 ఆదాయం లభించింది. ● అలాగే స్వామివారిని రిటైర్డు ఐఏఎస్ అధికారి సుందర్ కుమార్ దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి చిత్రపటాన్ని ఈవో భద్రాజీ అందజేశారు.

ఎమ్మెల్యే రవికుమార్‌కు ఘన స్వాగతం



కూన రవికుమార్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఆమదాలవలస, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఆదివారం కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. గత 20 రోజులుగా అమెరికా దేశంలోని వివిధ పట్టణాల్లో గల వివిధ సంస్థలు, యూనివర్సిటీలు, లైబ్రరీలు, ఎన్ఆర్ఐల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తన అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని వస్తున్న సందర్భంలో విశాఖ ఎయిర్ పోర్టులో ఆయనకు కూటమి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, రామినాయుడు, సనపల డిల్లీశ్వరరావు, కూకరాజు, తదితరులు స్వాగతం పలికారు.

పీఆర్సీ ప్రకటించాలి



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం కార్యదర్శి జనార్దనరావు

ఆమదాలవలస, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, 30 శాతం పీఆర్ ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.జనార్దనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని లక్ష్మీనగర్‌లోని ఓ పాఠశాలలో సురవరపు తమ్మినాయుడు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు వ్యతిరేకంగా ఆమోదించిన బిల్లును తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఆర్ బకాయిలు, పీఆర్సీ బకాయిలు, చనిపోయిన పెన్షనర్ల కుటుంబాలకు దహన సంస్కారాల ఖర్చులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఆర్.సత్యనారాయణ, కె.షన్ముఖరావు, పి.భానోజీరావు, బీవీ రమణ, మోహనరావు, సంజీవరావు, నారాయణరావు, చిట్టయ్య, బలివాడ వెంకటరమణ, కె.కోటేశ్వరరావు, ఎన్.వాసుదేవరావు, జి.కృష్ణమూర్తి, బీవీ.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా హరకేశ్వరస్వామి జాతర



హరకేశ్వరస్వామి జాతరలో ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సింగుపురంలో జరుగుతున్న ఉమా హరకేశ్వర జాతరలో పాల్గొని స్వామివారిని ఎమ్మెల్యే శంకర్ ఆదివారం దర్శించుకున్నారు. మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

● అలాగే ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఈవో భద్రాజీ స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

అరసవల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో గల 16వ డివిజన్, గొంటివీధిలో టీడీపీ ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణ మాదిగ, డివిజన్ ఇన్‌చార్జి సవ లావురపు లక్ష్మి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ ఎంతో కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం దేశంలోనే ఉన్నత స్థానంలో నిలవడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో కొర్లకోట కొండలరావు, కొయ్యాన కృష్ణారావు, గణపతి, బోను నాగరాజు, సవలాపురపు భారతి, లోపింటి రాజేశ్వరి, గోటివాడ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కృత్యాధార బోధనతో ప్రయోజనం

ఎచ్చెర్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కృత్యాధార బోధనతో పిల్లలకు ఎంతో ప్రయోజనమని సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ అదనపు సమన్వయకర్త డాక్టర్ ఎస్.శశి భూషణ్ అన్నారు. వర్సిటీలో భారత పునరావాస మండలి (ఆర్‌సీఐ- న్యూ ఢిల్లీ)తో కలిసి వర్సిటీ విద్యా విభాగం జాతీయ విద్యా విధానం -2020 సూచన సంఘటిత విద్య అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులైన పిల్లలను బోధించే ఉపాధ్యాయులు సానుకూల దృక్పథంతోనే సత్ఫలితాలు సాధించగలరని చెప్పారు. పిల్లలను చైతన్యపరిచేలా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వర్సిటీ ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న, ఏయూ విద్యా విభాగం ప్రొఫెసర్ ఎంవీవీఎస్ ప్రకాష్, వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖరరావు, కన్వీనర్ హనుమంతు సుబ్రమణ్యం పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు ధ్రువపత్రాలు అందించారు.

మేధా టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

కంచిలి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కంచిలిలో నిర్వహించిన జిల్లాస్థాయి మేధా టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించినట్టు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన జిల్లాస్థాయి పరీక్షకు 133మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈవో శివరాంప్రసాద్, అపోటా జిల్లా అధ్యక్షుడు భాస్కర్ బహుమతులు అందజేశారు.

● ఇచ్ఛాపురం: స్థానిక ఒడియా పాఠశాలలో నిర్వహించిన మేధా సమాన్ ట్యాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. ఆదివారం నిర్వహించిన ట్యాలెంట్ టెస్ట్‌లో వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి 100మంది విద్యార్థులు పాల్గొన్నారు. ట్యాలెంట్ టెస్ట్ ప్రశ్నా పత్రాలను ఎంఈవో ఎస్.విశ్వనాథ్ ఆవిష్కరించారు. గెలుపొందిన విద్యార్థులకు అధ్యక్షుడు అశోక్‌కుమార్ జాదో, సెక్రటరీ డిల్లీశెట్టి బహుమతులు అందజేశారు.

● సోంపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మేధ సమ్మాన్ ప్రతిభ పరీక్షలో ఐదో తరగతి ఒరియా పిల్లలకు మండల స్థాయిలో పోటీలు ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. డీఐ ఆఫ్ స్కూల్స్ డీపీ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో జోరడ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల విద్యాలయ ప్రవేశ పరీక్ష

గుజరాతీపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి ఆదివారం ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 2025-26 విద్యా సంవత్సరానికి ఐదు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ప్రవేశ పరీక్షను జిల్లాలో తొమ్మిది కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిశాయి. ఐదో తరగతికి 1261 మంది దరఖాస్తు చేసుకోగా 1,063 మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి గాను 1,318 మంది దరఖాస్తు చేసుకోగా 1,142 మంది హాజరయ్యారు. రాష్ట్ర పరిశీలకులు డి.వామనమూర్తి జిల్లాలోని పెద్దపాడు, ఎచ్చెర్ల, తామరాపల్లి, దుప్పలవలస పాఠశాలలు, కళాశాలల్లో జరిగిన పరీక్ష కేం ద్రాలను తనిఖీ చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద అన్ని మౌలిక వసతులు కల్పించినట్టు జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ నాయిక్ తెలిపారు.

మహనీయుడు అంబేడ్కర్

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): భారత దేశానికి దశ దిశ కలిగించిన మహనీయుడు భారత రాజ్యాంగ నిర్మాత అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్ని స్థానిక ఎచ్చెర్ల బీఆర్ఏయూ ప్రొఫెసర్ కళ్లేపల్లి ఉదయ్ కిరణ్ అన్నారు. ముఖ్యంగా బడుగు వర్గానికి, స్వాతంత్ర్య ఫలాలు అందటానికి అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారని వక్తలు అన్నారు. ఆదివారం ఇలిసిపురం అంబేడ్కర్ విజ్ఞాన భవన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సందర్భంగా సమతా భారత్ కవిత గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, పత్తి సుమతి, తులాల సవరమ్మ, కిలాన శ్రీనివాసరావు, కేతవరపు శ్రీనివాసరావు, మండా ప్రభాకర్‌రావు, నల్లి ధర్మారావు, కంచరాన భుజంగరావు, కుప్పిలి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన

కవిటి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవడానికి ప్రతిభా పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని ఎంఈవో ధనుంజయ మజ్జి అన్నారు. ఆదివారం ఒడియా టీచర్స్ అసోసియేషన్ కవిటి మండల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మేధా సమ్మాన్ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో పెద్ద ఎర్రగోవిందపుట్టుగ విద్యార్థి వై.హరికృష్ణ, ఆర్.అగ్రహారానికి చెందిన విద్యార్థి ఆర్.ధనుంజయ, చిన్న మెళియా పుట్టుగకు చెందిన బాసంతి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సొంతం చేసుకున్నారు. ఒరియా ఫైనార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ పాడి, కేశవ పూరియా, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

జి.సిగడాం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో నష్టపోయిన జీడి, మామిడి తోటల రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఏపీ కౌలు రౌతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన శేతుభీమవరం రైతులు బి.రమణ, బి.అప్పలసూరి, ఎస్.రమణ, ఎస్.అప్పారావు, జి.కామయ్య, జి.అప్పారావు, గెడ్డకంచరాం గ్రామానికి చెందిన కొందరి రైతులకు చెందిన జీడి, మామిడి తోటలు ఆయన పరిశీలించారు. ఎకరాకు రూ.70 వేలు పరిహారంగా ఇవ్వాలని, ఉచితంగా మొక్కలు అందించాలని కోరారు.

పుస్తకావిష్కరణ

అరసవల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు రచించిన సైబర్ నేరాలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు పుస్తకాన్ని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ యుడు తన కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రస్తుత కాలంలో ఈ పుస్తకం ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బార్ అసోసియేషన్ భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివ ప్రసాదరావు, కార్యదర్శి పిట్ట దామోదరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర

కవిటి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీటీడీలోని గో మరణాలపై భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రలో భాగమే అని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. గో మరణాలపై తప్పుడు ప్రచారం చేస్తూ గోశాలలో 100 ఆవులు చనిపోయాయంటూ కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. గోశాలలోని ఆవులు వృద్ధాప్యం డెలివరీ సమయంలో వ్యాధులతో నెలకు సగటున 10 ఆవులు మృత్యువాతల పడుతుంటాయని ఇవి గత ఐదేళ్లగా గుణాంకాలు చూస్తే స్పష్టమతుందన్నారు. ఇప్పుడు గడిచిన మూడు నెలల్లో వృద్ధాప్యం, వ్యాధులు వంటి కారణాలతో 40 ఆవులు మృత్యువాత పడ్డాయని, దీని రాద్ధాంతం చేయడం తగదన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



నరసన్నపేట: ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నగరంలో ఏసుక్రీస్తు భక్తులు ఆదివారం మట్టల పండుగ ఘనంగా నిర్వహించారు. సుమారు 500 మంది మట్టల పండుగ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తనలు ఆలపిస్తూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న సహాయమాత చర్చి వరకు ర్యాలీ చేస్తూ ప్రార్థనలు చేశారు.

● ఇచ్ఛాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మట్టల ఆదివారంను(పామ్ సండే) క్రైస్తవులు వేడుకగా జరిపారు. గొల్లవీధి జంక్షన్ వద్ద గల చర్చిలో ప్రార్థనలు జరిపి అనంతరం మట్టలు పట్టుకొని పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. మతపెద్దలు వజ్రపు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

● నరసన్నపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కల్వరి బాపిస్టు చర్చి ఆధ్వర్యంలో ఆదివారం మట్టల ఆదివారం ఫాదర్ జాన్ డేవిడ్ పర్యవేక్షణలో చేపట్టారు. ఏసుక్రీస్తు జయం నినాదాలతో ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో పాస్టర్ రత్నకుమారి, ప్రవీణ్, పి.రవికుమార్, శరత్‌కుమార్, జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఆమదాలవలస, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): లోక రక్షకుడైన ఏసుక్రీస్తు సర్వలోకమంతా కల్వరి సిలువలో ప్రాణం పెట్టి రక్షణ అనుగ్రహిస్తున్నాడని సంఘ కాపరి శ్యామ్ అన్నారు. పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి పక్కన గల బైబిల్ మిషన్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించారు. రామారావు, విజయకుమార్, లక్ష్మణరాజు, రాజేష్, ప్రసాద్, ఆనంద్ పలువురు క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: ర్యాలీ చేస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం: ఊరేగింపుగా వెళ్తున్న క్రైస్తవులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

● తక్షణం స్పందించిన ఎస్ఐ



క్షతగాత్రులను తీసుకువెళుతున్న ఎస్ఐ ఎండీ యాసిన్

హిరమండలం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): హిరమండలం ఎస్ఐ ఎండీ యాసిన్ మానవతా దృక్పథం చాటుకున్నారు. ఆదివారం రాత్రి కొండరాగోలు కాలనీ సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కొత్తూరు మండలం ఇరపాడు గ్రామానికి చెందిన టేగ నారాయణరావు హిరమండలం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళుతూ కొండ రాగోలు కాలనీ సమీపంలో నడిచి వెళుతున్న అదే గ్రామానికి చెందిన గుజ్జు చిన్నారావును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. చిన్నారావుకు చెవుల నుంచి రక్తస్రావమై పరిస్థితి విషమంగా ఉండడంతో ఎస్ఐ యాసిన్ స్వయంగా పోలీస్ జీపులో ఎక్కించి హిరమండలం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో 108వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. నారాయణరావుకు హిరమండలం ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఎస్ఐ స్పందించిన తీరును పలువురు ప్రశంసించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి..

నరసన్నపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తామరాపల్లి గ్రామం వద్ద హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం పెద్ద జడూరుకు చెందిన డి.హేమలరావు తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్రవాహనంపై నరసన్నపేట నుంచి టెక్కలి వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో హేమలరావు తలపై తీవ్రంగా గాయాలయ్యాయి. 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి

శ్రీకాకుళం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నాగావళి నదిలో చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. గనగల్లవానిపేట వద్ద ఆదివారం నాగావళి నదిలో పుక్కల్ల గణేష్ చేపలవేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతయ్యాడు. కొద్దిసేపటి తర్వాత మృతి చెందినట్టు స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకుని, మత్స్యకారుడి మృతికి సంతాపం తెలిపారు. గణేష్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

పశువుల లారీ పట్టివేత

ఎచ్చెర్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అక్రమంగా పశువులను తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. జాతీయ రహదారి జరజాం జంక్షన్‌లో తనిఖీలు చేస్తుండగా నరసన్నపేట నుంచి విశాఖ తరలిస్తుండగా పట్టివేశారు. పశువులను కొత్తవలస గో సంరక్షణ కేంద్రానికి తరలించినట్టు ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు.

వంశధార కాలువ గట్టు తొలగింపు





పైపుల ఏర్పాటుకు తీసిన గొయ్యి, వంశధార ప్రధాన ఎడమ కాలువ గట్టును చదును చేసిన వైనం

జలుమూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వంశధార ప్రధాన ఎడమ కాలువ గట్టును కొందరు ఎక్స్‌వేటర్‌తో తొలగించి సాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసినా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. కరకవలస గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కిట్టాలపాడు గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ గ్రామానికి సాగునీరు తీసుకువెళ్లేందుకు శనివారం రాత్రి కరకవలస, బైదలాపురం గ్రామాల మధ్యలో ఉన్న వంశధార ప్రధాన ఎడమ కాలువ గట్టును తొలగించి పైపులు ఏర్పాటు చేసి తెల్లవారే సరికి యథా విధిగా గట్టును చదును చేశారు. వారి స్వలాభం కోసం ఇలా చేశారని కరకవలస రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విషయాన్ని వంశధార అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన ప్పటికీ పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై వంశధార జేఈ కె.ధనుంజరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా బైదలాపురం వంతెన పనులు చేయిస్తున్నామని, సమాచారం తెలియగానే బాధ్యులను పిలిచి హెచ్చరించామన్నారు. కాలువ గట్టు తొలగించారని, అయితే పైపులు వేయలేదన్నారు. పైపులు వేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించామన్నారు.

విద్యా వలంటీర్‌కు రూ.1.15 లక్షల సాయం



విద్యా వలంటీర్‌కు నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కిడిసింగి గ్రామానికి చెందిన ఇప్పిలి నర్సింహులు 18 ఏళ్లుగా విద్యా వలంటీర్‌గా పనిచేసి ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురి కాగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, దాతలు రూ.1,15,500 సాయాన్ని అందించారు. ఆదివారం నర్సింహులు ఇంటికి వెళ్లి ఈ మొత్తం అందించారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు, ఉపాధ్యాయులు జయరాం, శ్రీనివాసరావు, ఉపేంద్ర, గున్న సుభాష్ పాల్గొన్నారు.

స్వర్ణకారుల నూతన సంఘం ఎన్నిక

హిరమండలం,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): హిరమండలం మండల శ్రీకామాక్షి స్వర్ణకార సేవా సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లవరపు హరిబాబు, ఉపాధ్యక్షుడిగా పోలాకి సురేష్, కార్యదర్శిగా మల్లవరపు ప్రసాద్‌రావు, జాయింట్ సెక్రటరీగా చక్రధర్, కోశాధికారిగా బండారు రాజ్‌కుమార్, గౌరవాధ్యక్షుడిగా పుల్లేటికుర్తి వెంకటరమణలను ఏకగ్రీంగా ఎన్నుకున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు.

ప్రమాదకరం.. పట్టించుకోని వైనం

● ఇదీ వంతెనలు, ర్యాంపుల దుస్థితి

పలాసరూరల్/నందిగాం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పలాస, నందిగాం మండలాల్లోని పలు కాలువలపై ర్యాంపులు, వంతెనలు రెయిలింగ్‌లు లేకపోవడం, శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు రాక పోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాల కిందట నిర్మించిన వీటి నిర్వ హణ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రధా నంగా వర్షాకాలంలో నీటి ప్రవాహానికి తరచూ పాడవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పలాస మండలం బ్రాహ్మణతర్లా వద్ద ఉన్న వరహాల గెడ్డపై ర్యాంపుపై నుంచి నిత్యం సుమారు 20 గ్రామాల ప్రజలు, వందలాది వాహనాలు రాక పోకలు సాగిస్తుంటారు. అలాగే కేదారిపురం వద్ద ర్యాంపు నిర్మాణం రెండేళ్ల కిందట చేపట్టినా రెయిలింగ్‌లు ఏర్పాటు చేయలేదు. ఈ ర్యాంపునుంచి కూడా వాహనాలు వెళుతూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే ర్యాంపులకు ఇరువైపులా ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో రాత్రి సమయాల్లో వాహనాలను తప్పించే సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



పలాస రూరల్: బ్రాహ్మణతర్లా వద్ద వరహాల గెడ్డపై రక్షణ గోడ లేని ర్యాంపు

● నందిగాం మండలం ఆనందపురం సమీపంలో వంశధార ప్రధాన ఎడమ కాలువపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా ఉంది. హరిదాసుపురం, ఆనందపురం, సవరబాణాపురం, పాత్రునివలస హైవేకి చేరుకునేందుకు ఈ వంతెనపైనుంచే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పలాస డిపో నుంచి పూండి, హరిదాసుపురం వయా ఆనంద పురానికి బస్సు సర్వీసు సైతం ఈ వంతెన పైనుంచే వెళుతుంటుంది. వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నందిగాం: ఆనందపురం సమీపంలో శిథిలావస్థకు చేరిన వంతెన

నివగాం-మాతల బ్రిడ్జిపై గోతులు

● తరచూ ప్రమాదాలు
● మరమ్మతులకు గురవుతున్న వాహనాలు

కొత్తూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నివగాం వద్ద వంశధార నదిపై నిర్మించిన వంతెనపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రిడ్జిపై ఎటువంటి లైట్లు ఏర్పాటు చేయపోవడంతో రాత్రి సమయాల్లో గోతులు కనిపించక వాహనాలు వాటిలో పడి మరమ్మతులకు గురికావడంతో పాటు వాహన దారులు ఆసుపత్రి పాలవుతున్నారు. బాటసారులకు సైతం గోతుల్లోని ఇనుప చువ్వలు గుచ్చుకుంటున్నాయని పలువురు వాపోతున్నారు. మాతల-నివగాంలను కలుపుతూ రూ.10 కోట్లతో 22 ఏళ్ల కిందట వంతెన నిర్మాణం చేపట్టారు. అయితే వాహనాల రద్దీ కారణంగా గోతులు ఏర్పడి ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా గాయాలబారిన పడాల్సిందేనని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



మాతల-నివగాం బ్రిడ్జిపై ఏర్పడిన గోతులు

'భూమన'వి తప్పుడు ఆరోపణలు: ఎమ్మెల్యే శిరీష



పలాస, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలలో ఆవుల మృతిపై మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డివి తప్పుడు ఆరోపణలని చేస్తున్నారని, వీటిని తిప్పికొట్టాలని ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తప్పుడు ప్రచారం చేస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రయత్నం చేస్తు న్నారని విమర్శించారు. రోజుకో ఆరోపణలు చేస్తూ ఆలయ సంప్రదాయాలు, మర్యాదలకు భంగం కలిగిస్తున్నారన్నారు. గోవుల మరణాలను రాజకీయం చేయడం తగదని, వంద ఆవులు మృతి చెందాయని ఆరో పించడంలో వాస్తవం లేదన్నారు. గోవులకు జియో ట్యాగింగ్ చేసి పర్యవేక్షిస్తారని, అటువంటి ధార్మిక సంస్థపై తప్పుడు ప్రచారాలు చేయడం తగదన్నారు. టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అసత్య ప్రచారాలు చేస్తున్న కరుణాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

టీటీడీ గోశాలపై విమర్శలు తగవు: ఎమ్మెల్యే బగ్గు



నరసన్నపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలలో వంద ఆవులు చనిపోయాయంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు దుర్మార్గమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లా డుతూ.. వైసీపీ పాలనలో శ్రీవారి సంపద కొల్లగొట్టారని ఆరోపించారు. రోజూ వందలాది టికె ట్లను అమ్ముకుని దోచుకోవడంతోపాటు ఎర్రచందనం స్మగ్లింగ్ చేసిన భూమన కరుణకర్ రెడ్డి ఇప్పుడు సనాతన ధర్మంపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో చేసిన అక్రమాలు, అరాచకాలు బయటకొస్తున్న తరుణంలో టీటీడీ గోశాలపై అసత్య ప్రచారం డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కరుణాకర్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్వేషాలు రెచ్చగొట్టేందుకే తప్పుడు వ్యాఖ్యలు: ఎంజీఆర్

పాతపట్నం/ఎల్ఎన్‌పేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకే టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నా రని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఆదివారం పాతపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలో ఆవుల మృతిపై ఆయన చేసిన దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీటీడీ పవిత్రతకు భంగం కలిగించేలా ఆయన వ్యవహరిస్తున్నారని ఆరో పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, నాయకులు జి.అశోక్ పెద్దింటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గోవిందరావు ఆదివారం ఎల్ఎన్‌పేట మండలం రావిచెంద్రి, పూశాం గ్రామాల్లో శుభకార్యాలకు హాజరై టీడీపీ నాయకులతో మాట్లాడుతూ ప్రభుత్వంపై వైసీపీ నాయకుల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మనోహర్ నాయుడు, కె.చిరంజీవి, ఎస్.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటూ..

మెళియాపుట్టి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుర్జని గ్రామంలో



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

శనివారం రాత్రి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుర్జని గ్రామం నుంచి పెద్ద లక్ష్మీపురం గ్రామానికి రోడ్డు ఏరాపటు చేయాలని మాజీ సర్పంచ్ బుర్లె లలితకుమారి కోరారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరారు. కాలువలతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం చేపడ తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సలాన మోహనరావు, తులసీవరప్రసాద్, బాస్కర్ గౌడ్, దినకర్‌రావు, పైడిరాజ్, పరమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు ఉన్నంతవరకూ ఉద్యమాలు

● 'కగార్'తో మావోయిస్టుల నిర్మూలన అసాధ్యం
● న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని



మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

కాశీబుగ్గ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అసమానతలు ఉన్నంతవరకు ఉద్యమాలు జరుగుతూనే ఉంటాయని, కగార్ పేరుతో మావోయిస్టుల నిర్మూలన అసాధ్యమని న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కాశీబుగ్గలో గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సీపీఐన్యూడెమోక్రసీ నేత పైల వాసుదేవరావు 15వ వర్ధంతి సభ నిర్వహిం చారు. పైల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నించే వాళ్లను చిత్ర హింసలు పెట్టి, ఇంకా ఎదురు తిరిగితే ఎన్‌కౌంటర్ చేస్తుండడం దారుణమన్నారు. ఆదివాసీలపై ప్రభుత్వమే రాజ్యహింసకు పాల్ప డుతోందని, పాలకులు కార్పొరేట్లకు వత్తాసు పలుకుతున్నారని, దీనికి వ్యతిరేకంగా ప్రజలకు అండగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పైల వాసుదేవరావు బలిదానం వృథా కాదని, శ్రీకాకుళం మట్టికి ఆ శక్తి ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్ ప్రజలకు ఉపయోగ పడాలని, అలా కాకుండా నిరుద్యోగం పెంచేలా ఉంటే పిడికిలి బిగించాల్సిందేనన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు విప్లవ గీతాలాపన, నత్య ప్రదర్శనలు చేశారు. అంతకుముందు వామపక్ష నేతలు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, కమిటీ సభ్యులు కొండయ్య, వెంకటేశ్వరరావు, పి.రమణి, రాజశేఖర్, వినోద్, బాలకృష్ణ, మాధవరావు, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతి వనాన్ని ప్రభుత్వమే నిర్వహించాలి

నందిగాం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): విజయవాడ మహానగరం స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ స్మృతి వనాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని ఏపీ దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు ఒక ప్రకటనలో కోరారు. 19 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పడం రాష్ట్రానికే తలమానికమని, అలాంటి స్మృతివనాన్ని పీపీపీ పద్ధతిలో టెండర్లకు ఆహ్వానించడం అంబేడ్కర్‌ను అవమానించడమే అవుతుందన్నారు. స్మృతి వనాన్ని వ్యాపార కేంద్రంగా మార్చవద్దని, టెండర్‌ను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

కాశీబుగ్గ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఉన్న భారత రాజ్యాంగ డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బీజేపీ నాయకులు ఆదివారం శుభ్రపరిచి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు వైకుంఠరావు, తారకేశ్వరరావు, రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కళాసమితి సభ్యులు

ప్రజాచైతన్య కళాసమితి ఆధ్వర్యంలో..

టెక్కలి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండాపొలం కాలనీలో ఆదివారం ప్రజాచైతన్య కళాసమితి, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఎంఈవో దాశరథి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డీఏ స్టాలిన్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి చిలుకు కృష్ణారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు పట్నాన ఢిల్లేశ్వరరావు, బసవల లోకనాథం, తూట భాస్కరరావు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: శిరీష



నగదు అందిస్తున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన టీడీపీ కార్యకర్త గుంటు జానకీరావును ఆదివారం ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ.50 వేలు నగదును అందిం చారు. మెరుగైన చికిత్స నిమిత్తం వైజాగ్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించేందుకు ఆమె సంబంధిత వైద్యులతో మాట్లాడారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందు పాపారావు, పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, నాయకులు పుచ్చ ఈశ్వరరావు, దున్న షన్ముఖరావు, కర్ని రమణ, బుల్లోజు శశిభూషణ్ పాల్గొన్నారు.

నిబంధనలు పట్టల్లే!

(ఐదో పేజీ తరువాయి)

తరువాత కూడా ఒప్పందాలు జరిగాయి. జనాభా ప్రాతిపదికన మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. మండలంలో కనిష్ఠంగా ఐదు వరకూ షాపులను ఏర్పాటుచేశారు. పట్టణ ప్రాంతాల్లో అయితే 7 నుంచి 10 వరకూ షాపులు ఏర్పాటయ్యాయి. కొన్ని షాపుల్లో రోజువారి విక్రయాలు అధికంగా ఉన్నాయి. మరికొన్ని వాటిలో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగడం లేదు. విక్రయాలు తక్కువగా ఉన్నచోట 'బెల్ట్'ను ప్రోత్సహిస్తోన్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

బహిరంగ ప్రదేశాల్లో..

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారితో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. క్రీడా మైదానాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఖాళీ స్థలాలు మందుబాబుల అడ్డాలుగా మారిపోయాయి. సాయంత్రం 5 గంటలు దాటితే చాలు మద్యం బాబుల సందడి ప్రారంభమవుతుంది. ముఖ్యంగా పట్టణాల్లో ఈ సంస్కృతి అధికంగా ఉంది. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరం. కానీ, జిల్లాలో ఈ నిబంధన కనీసం అమలు కావడం లేదు. చాలాచోట్ల పోలీసుల హెచ్చరికలతో మందుబాబులు వెనక్కి తగ్గుతున్నారు. మందుబాబుల ఆగడాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరముంది.

ఇష్టానుసారంగా బెల్టు షాపులు..

పట్టణ, మండల పరిధిలో ఇష్టానుసారంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నా, లూజ్ అమ్మకాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. నిబంధన లకు విరుద్ధంగా 21లోపు వయసు గల వారికి మద్యం విక్రయిస్తున్నారు. ఒక క్వార్టర్ మీద రూ.10 పెంచుకోమని ప్రభుత్వం అనుమతి ఇస్తే, పాత స్టాక్‌ను కూడా పెంచుకుంటూ అమ్మకాలు జరుపుతున్నారు.

అనుమతి లేదు..



మద్యం దుకాణాల వద్ద తాగేందుకు అనుమతి లేదు. ఒక వేళ పర్మిట్ రూమ్‌లు కావాలంటే ప్రభుత్వానికి రూ.5 లక్షలు కట్టాలి. లేకుంటే అక్కడే చిరుతిళ్ల దుకాణాల వద్ద తాగితే నేరం. బహిరంగ ప్రదేశాల్లో సైతం మద్యం తాగకూడదు. అలా తాగి దొరికితే కేసులు నమోదు చేస్తాం.

-మీసాల చిన్నమనాయుడు, సీఐ, ఇచ్ఛాపురం

న్యూస్ బాక్స్

నవధాన్యాల సాగుతో ప్రయోజనం

హరిపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ దుర్గావరప్రసాద్ అన్నారు. విత్తన సేకరణ దినోత్సవం సందర్భంగా హరిపురంలో ఆదివారం రైతులకు నవధాన్యాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘ అధ్యక్షురాలు తిరుపతమ్మ, శ్రావణి, ఎస్.కుమారి తదితరులు పాల్గొన్నారు.

అవి అక్రమ తవ్వకాలు కావు

పలాస, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సూదికొండ దిగువన కేంద్రీయ విద్యాలయానికి సర్వే నెంబరు 51లో కేటాయించిన స్థలం చదును చేసేందుకు కంకర తవ్వుతున్నామని, ఇవి అక్రమ తవ్వకాలు కావని తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి ప్రకటించారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మిగిలిన కంకరను సుడా ఆధ్వర్యంలో జరుగుతున్న ఎంఐజీ గృహాల అభివృద్ధికి వినియోగించడం జరుగుతుందన్నారు. నిబంధన ప్రకారం తరలిస్తున్న కంకరకు మైనింగ్ శాఖకు సీనరేజ్ పన్నులు చెల్లించాలని ఆదేశాలిచ్చామని, కంకరను ఇతర అవసరాలకు వినియోగించడం జరగదని స్పష్టం చేశారు. ఈ వ్యవహా రంలో పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

హాల్‌టికెట్లు సిద్ధం

పోలాకి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఈదులవలస ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహిస్తున్న పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్లు సిద్ధంగా ఉన్నాయని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు హాల్‌టికెట్ల కోసం పాఠశాల పనిచేయు వేళల్లో ఆన్‌లైన్ దరఖాస్తు నకలు తీసుకు వచ్చి సంప్రదించాలన్నారు. ఈనెల 21న ప్రవేశ పరీక్ష కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99492 45179 నెంబరులో సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా గురుకులాల ప్రవేశ పరీక్ష

పాతపట్నం/నందిగాం/నరసన్నపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాల, కళాశాలల్లో ఆదివారం 5వ తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్షలు జరిగాయి. పాతపట్నం, నరసన్నపేట, నందిగాంలో పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాలను గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ పరిశీలించారు.

జీడిపై తెగుళ్ల దాడి

(ఐదో పేజీ తరువాయి)

ఎకరాకు ఆరు బస్తాలు రావాల్సిన చోట కేవలం 3 బస్తాలు మాత్రమే వస్తుందని, ఇలా అయితే పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదని ఉద్దాన రైతులు భయపడుతున్నారు.

రైతులకు సలహాలు అందిస్తున్నాం..

ఈ ఏడాది వర్షాభావంతో పాటు మే నెలలో ఉండాల్సిన వేడి మార్చి నుంచే ఉండడంతో జీడిలో ఎదుగుదల లోపించింది. వాతావరణంలో మార్పులతో జీడి చెట్లకు తెగుళ్ల వ్యాపించాయి. తెగుళ్ల నివారణకు సలహాలు అందిస్తున్నాం.

-శంకర్, ఉద్యానవనశాఖాధికారి

ప్రభుత్వం ఆదుకోవాలి..



ఈ ఏడాది జీడికి ఆశించిన తెగుళ్లతో రైతు లకు నష్టాలు వస్తు న్నాయి. ఎకరా తోటకు 3 బస్తాలకు మించి దిగుబ డి వస్తే ఎంతో ఆనందం. మందులు, కంచె, దున్నడం వంటి వాటికి అధికంగా ఖర్చు అవుతుంది. తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేస్తున్నాం. మందుల ధరలు సైతం పెరిగిపోయాయి. దీనివల్ల ఎకరాకు సుమారు రూ.5వేల వరకు అదనపు ఖర్చు అవుతుంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

-మామిడి భాస్కరరావు, ఉద్దానం రైతు, మామిడిపల్లి